# సన్మానం

## -కారంపూడి వెంకట రామదాస్

అది కలెక్టర్ ఆఫీస్! రోజూ మాదిరిగా అక్కడ చాలా సందడిగా ఉంది. ఎంతోమంది ఎన్నెన్నో ఆశలతో అక్కడికొస్తుంటారు. కొందరికి వెంటనే పనులవుతాయి. మరికొందరికి ఆ ఆఫీసు చుట్టూ ఎన్ని ప్రదక్షిణాలు కొట్టినా నిరాశే మిగిలేదన్నది జగమెరిగిన సత్యం. కలెక్టర్‌తో పాటూ జాయింట్ కలెక్టర్ ఉండే కార్యాలయం అది. ఇద్దరూ ఐ.ఏ.ఎస్. రేంక్ ఆఫీసర్లే!

"సార్. ఈ రోజు వచ్చిన ఉత్తరాలు." అంటూ ప్యూన్ నా టేబిల్ మీద ఉత్తరాలదొంతిని పెట్టాడు.

జాయింట్ కలెక్టర్‌గా ఆ ఉత్తరాలని సావధానంగా చదివి వాటిపై సరైన ఏక్షన్ తీసుకోవడం నా విధి. నా వంతు న్యాయం చేయడానికి నేనెప్పుడూ సిద్ధమే. అందుకే వాటిని శ్రద్ధగా చదువుతాను.

"సరే..కలెక్టర్‌గారు వచ్చారా..?" అడిగాను ప్యూన్ని.

"ఆ ఏదో అర్జెంట్ పనుందని ఉదయమే వచ్చారు."

"ఓ.కె. నేను తరువాత కలుస్తాలే..." అని నా పనిలో పడ్డాను. ఎన్నో పనులు! గుట్టలుగా ఫైల్స్... వీలైనంత వరకూ వాటిని ఏ రోజుకారోజే క్లోజ్ చెయ్యాలన్నది నా ప్రయత్నం! ముందుగా ఆ రోజు వచ్చిన ఉత్తరాలపై దృష్టి సారించాను. అందులో ఒక ఉత్తరం నా దృష్టి నాకర్షించింది. అది ఓ ఊరి వి.ఆర్.ఓ. రాసింది. వాళ్ల ఊరిలో అందరూ కలసి మద్యపాన నిషేధానికి తీర్మానించుకున్నారట.

కానీ సారా కాంట్రాక్టరు అడ్డు తగులుతున్నాడు. అందుకే తమని జోక్యం చేసుకోమని ఆ ఉత్తర సారాంశం.

సాధారణంగా పించన్లు అందలేదనీ.. రిటైరైనా ఇంకా సెటిల్మెంట్ కాలేదనీ.. మా ఊర్లో ఇది లేదనో అది లేదనో అలాంటి కంప్లైంట్స్ ఎక్కువ. కానీ ఇదో సామాజిక సమస్య! రాజకీయం జోక్యం చేసుకున్నా ఆశ్చర్యం లేదు. ఇదేదో కలెక్టర్‌తో చర్చించి చర్య తీసుకోవాలి అనుకుని ఆ ఉత్తరాన్ని పక్కన పెట్టాను.

ఆ ఉత్తరాల మధ్య నాకొచ్చిన పర్సనల్ కవర్ ఒకటి కంటబడింది. అది అమ్మ రాసిన ఉత్తరం. వెంటనే కవరు చించి చదివాను.

"మురళికి!

ఆశీర్వాదములతో మీ అమ్మ రాయునది.. నేను క్షేమం. నువ్వు బాగున్నావని తలుస్తాను. ఒరే మురళీ.. ఇక్కడ జీవితం సాఫీగా సాగిపోతున్నది. నువ్వు ఇక్కడ లేవనే ఒకే లోటు తప్పా అంతా బాగానే ఉంది. ఒక్కసారి మన ఊరొచ్చి వెళ్లకూడదురా? కోడలూ, మనవడ్ని చూసి చాలా రోజులైంది కదా.. ఓ సారి చూడాలనుంది. ఆ ఒక మాట.. మీ నాన్నగారు స్వాతంత్ర్య సమరయోధులని నీకు తెలిసిందే కదా.. అతని సావాసంలో నాకూ అంతో ఇంతో దేశభక్తి వంటబట్టిన మాట నీకూ తెలుసుగా.. ఆ ఆశక్తితోనే నేనొకటి అడగాలనుకుంటానురా.. ఇంకొద్ది రోజుల్లో గణతంత్ర దినోత్సవం వస్తోందిగా. ఆ రోజు మన జిల్లా ప్రధాన కేంద్రంలో జరిగే గణతంత్ర దినోత్సవ ఉత్సవాలని కళ్లారా ఒక్కసారి చూడాలనుందిరా.. మన త్రివర్ణ పతాకం గగనాన్ని రెపరెపలాడుతుంటే చూసి ఆనందించాలనుంది. ఎప్పుడో మీ నాన్న బ్రతికున్న రోజుల్లో నన్ను విధిగా తీసుకెళ్లేవారు. ఈసారి నువ్వు దగ్గరుండీ నాకు ఆ వేడుకల్ని చూపించాలి.. ఎలాగో నువ్వు జాయింట్ కలెక్టర్ వేగా! ఆ ఉత్సవంకి నువ్వు కలెక్టర్‌తో పాటూ హాజరవుతావని నాకు తెలుసు. నన్నూ తీసుకువెళతావని ఆశిస్తున్నాను. ఏ విషయం నువ్వు జవాబు వ్రాయి. కోడల్నీ పిల్లల్నీ అడిగినట్టు చెప్పు. ఇక ఉంటా'

ఇట్లు

అమ్మ

'ఉ' బాగుందీ.. అమ్మకీ వింత కోరికేంటో? అమ్మని గణతంత్ర దినోత్సవ వేడుకలకి తీసుకెళ్లడం పెద్ద విషయం కాదు. కానీ, వచ్చిన గొడవంతా అమ్మతోనే. ఆ ఉత్సవానికి చాలా పెద్ద పెద్ద వ్యక్తులు వస్తారు. వారి మధ్య అమ్మను ఊహించుకోలేకపోయాను. ఎందుకంటే.. అమ్మకి పెద్దగా చదువు రాదు! ఇంకా చెప్పాలంటే పల్లెటూరి మనిషి.

ఆమె కట్టూ బొట్టే కాకా మాటతీరూ పల్లెటూరి తరహావే. అమ్మని నలుగురికీ పరిచయం చేయాల్సివస్తే వారి ముందు నాకు చిన్నతనంగా ఉంటుంది.

అసలే మిగతా ఆఫీసర్లూ వారి తల్లిదండ్రులూ హైక్లాస్ సొసైటీకి చెందినవారు. వారి మధ్య అమ్మనూహించుకోలేకపోయాను. ఏదో ఒక సాకుతో ఈ గండం నుండీ గట్టెక్కాలనుకున్నాను. ఆ ఉత్తరాన్ని టేబుల్ మీద పెట్టి వేరే ఫైల్స్‌లో పడ్డాను.

కొన్ని ఫైల్స్ కంప్లీట్ చేసి వాటిని ప్యూన్‌తో కలెక్టర్ వద్దకి పంపాను. తరువాత మిగతా పేపర్ వర్క్‌లో పడ్డాను.


సరిగ్గా పన్నెండవుతుంటే ప్యూన్ నా వద్దకి వచ్చి..

"సార్! కలెక్టర్‌గారు మిమ్మల్ని రమ్మన్నారు" అని చెప్పి వెళ్లాడు.

నేను పంపిన ఫైల్స్ గూర్చి డిస్కస్ చేయడానికి అయి ఉంటుందని అనుకుని లేచి కలెక్టర్ రూమ్ వైపు కదిలాను.

'గంగాధర్ ఐ.ఎ.ఎస్..కలెక్టర్' అని అందంగా చెక్కిన బోర్డు కలెక్టర్ గది ద్వారానికి వేళ్లాడుతుంది.

"మిస్టర్ మురళీ! ఐ హేవ్ సీన్ సమ్ ఆఫ్ ద ఫైల్స్ అండ్ లెటర్స్.. అందులో ఒక లెటర్ చూశారు.. అదే.. ఏదో గ్రామంలో మద్యపాన నిషేదానికి ప్రయత్నిస్తుంటే అక్కడి కాంట్రాక్టర్ అడ్డు తగులుతున్నాడని ఎవరో కంప్లైంట్ చేశారు



కదా...! ఆ ఊరికి మనం ఒక్కసారి వెళ్ళి సమస్య పరిష్కరించడానికి ప్రయత్నించి చూస్తే ఎలా ఉంటుందంటారు?'' అడిగాడు గంగాధర్.

“అదీ..బాగానే ఉంటుంది కానీ.. ఆ కాంట్రాక్టర్‌కి రాజకీయ శక్తులతో సంబంధం ఉందేమో, అందుకే అడ్డు తగులుతున్నాడని పిస్తోంది. ఒక్కసారి ఆలోచించుకుని ఇందులో తల దూరిస్తే బాగుంటుంది.'' నా వంతుగా చెప్పి చూశాను.

“నో... ఆ ప్రోబ్లమ్స్ నేను చూసుకుంటాలే..''


“ఒ.కె. మీ ఇష్టం..'' అన్నాను. కలెక్టర్ గురించి నాకు బాగా తెలుసు.

అతనికీ రాజకీయవర్గంలో బాగానే పలుకుబడుంది. అందుకే అప్పుడప్పుడూ ఇలాంటి సాహసాలకి పూనుకునీ ప్రజల్లో మంచి పేరు సంపాదించాడు.

“సరే.. రేపే మన ప్రయాణం. ఆ ఏర్పాట్లు చూసుకోండి'' అని నన్ను ఇక వెళ్లమన్నారు.

“ఒ.కె.'' అని అక్కడ నుండీ కదిలాను.

★ ★ ★



అది మారుమూల ఓ చిన్న పల్లెటూరు. పేరు గొల్లపల్లి. ఆ గ్రామానికే మా ప్రయాణం. నేనూ, కలెక్టరుగారు ఒక కారులో కూర్చున్నాము.

ముందొక పోలీసు జీపూ వెనుకొక పోలీసు జీపూ మాకు ఎస్కార్టుగా వస్తున్నాయి. ఆ ఊరు చేరేమో లేదో, గ్రామస్తులు 'కలెక్టరొచ్చారు', 'కలెక్టరొచ్చార'ని హడావిడి చేశారు. ఒక విధంగా మా హఠాత్ పర్యటన ఆ గ్రామస్తులకి ఆశ్చర్యం కలిగించింది.

ఆ ఊర్లో పోలీస్ స్టేషన్ లేదు కాబట్టి ఆ పక్క ఊరి పోలీసులకి మా రాక తెలియజేశాం. అదీ ఓ గంట ముందే! దాంతో వారు హడావిడిగా గొల్లపల్లి చేరుకుని హడావుడి చేయడంతో అప్పుడే మా రాక అక్కడివారికి తెలిసింది.

వి.ఆర్.ఒ., ఇతర పెద్దలు వచ్చి కలెక్టర్నీ, నన్నూ సాదరంగా ఆహ్వానించారు. అందరం వి.ఆర్.ఓ. ఇంటి వద్దే సమావేశం అయ్యాం.

వెంటనే విషయంలోకి దిగాడు గంగాధర్.

“మద్యపాన నిషేధం మీ గ్రామ ప్రజలందరికీ మనస్ఫూర్తిగా ఇష్టమైతే, అది అమలయ్యేలా మేం చూస్తాం'' అన్నాడు గంగాధర్.

“మా అందరికీ మనస్ఫూర్తిగా ఇష్టమే..'' ముక్తకంఠంతో అన్నారు అక్కడ గుమిగూడిన గ్రామస్తులు.

“మరి ఎవరు అడ్డుపడుతున్నారు?''

“అదీ..అదీ..ఈ ఊరి సారా కాంట్రాక్టర్..సూరీడు'' బెరుకుగా బెరుకుగా అన్నారు.

“ఆ సూరీడ్ని పిలుచుకొని రండీ..'' అని పోలీసుల్ని ఆదేశించాడు గంగాధర్.

మరి కాసేపటికి సూరీడు అక్కడికొచ్చాడు.

“సార్ .. పిలిచారట! ఎందుకో..?'' అన్నాడు సూరీడు కలెక్టర్‌నుద్దేశించి.

“చూడు సూరీడు... మీ గ్రామస్తులంతా ఓ మంచి పనికి పూనుకున్నారు. అదే.. మద్యపాన నిషేధం..! ఇది నీకు తెలిసిన విషయమే! దానికి నీ సహకారం ఎంతో అవసరం. నీ బిజినెస్ మానీ వేరే ఏదైనా వ్యాపారం చేసుకో. అది మీ గ్రామానికంతటికీ చాలా మేలు.''

“అదేంటి సార్.. ఎన్నో ఏళ్లగా ఇదే వ్యాపారం చేస్తున్నా. ఇది మానీ నేనేం చేసేది?''

“నువ్వు ఈ గ్రామస్తుల ఆదర్శ నిర్ణయానికి సహకరిస్తే నీకో మంచి అవకాశం ఇస్తాను. అదేంటంటే.. ఈ ఊర్లోనే నీకో స్థలం ప్రభుత్వం తరఫున కేటాయించీ అక్కడ నీ చేత ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్ పెట్టిస్తా. ఆ ప్లాంట్‌కయ్యే మదుపు రుణంగా బ్యాంక్ ద్వారా నేను నీకు ఇప్పిస్తా.

ఆ యూనిట్‌కి నువ్వే సొంతదారుడివి. ఇదంతా ఎందుకు చేస్తున్నానంటే.. కేవలం ఊరి ప్రజల ప్రయోజనం కోసం మాత్రమే.''

ఈ మాటలకి సూరీడు ముందు ఆశ్చర్యపోయాడు. తరువాత ఆలోచించాడు.


ఇందులో తను డబ్బు పెట్టేదీ లేదూ నష్టపోయేదీ లేదనుకున్నాడు. ఎంత రాజకీయ పలుకుబడిని ఉపయోగించినా తనకి కలెక్టర్‌తో విరోధం అంత మంచిదికాదని కూడా ఆలోచించాడు.

ఆ వెంటనే ఒక నిర్ణయానికొచ్చేశాడు.

''సరే సార్... మీరు హామీ ఇచ్చారు కాబట్టి నాకూ అంగీకారమే...'' అన్నాడు.


వెంటనే అక్కడి ప్రజలు ఆనందంతో ''కలెక్టర్‌గారూ జిందాబాద్..'' ''కలెక్టర్‌గారూ జిందాబాద్..'' అంటూ నినాదాలు చేశారు.

గంగాధర్ ఈ సమస్యని ఇంత చక్కగా నిమిషాల్లో పరిష్కరించడం నాకూ



# జగన్మోహినిగా నమిత?

దాదాపు పాతికేళ్ల క్రితం వచ్చిన 'జగన్మోహిని' ఆబాల గోపాలాన్ని ఉర్రూతలూగించింది. అంతేకాదు, ఆ చిత్రం జయమాలిని కెరీర్‌ని హీరోయిన్‌గా కొత్త మలుపు తిప్పింది. ఆ సినిమాని మళ్లీ ఇప్పుడు పునర్నిర్మించే ప్రయత్నాల్లో వున్నట్టు టాలీవుడ్ వార్తలు. ఇందులో జయమాలిని పాత్రని నమిత పోషించే అవకాశాలున్నాయట. మాయలూ మంత్రాలూ అంటే ఈరోజుల్లో (గ్రాఫిక్స్ పేరుతో) బాగానే చూస్తున్న జనాలకి కొత్త 'జగన్మోహిని' నచ్చే అవకాశాలుంటాయనే భావించవచ్చు.




ఆశ్చర్యం కలిగించింది. అతడ్ని మనసులో అభినందించకుండా ఉండలేకపోయాను.

''ఆగండీ.. నన్ను కాదు, మీ మనోభావాల్ని గౌరవించీ నా ప్రతిపాదన్ని ఒప్పుకున్న సూరీడ్ని అభినందించండీ...'' అన్నాడు గంగాధర్.

వెంటనే ''సూరీడూ జిందాబాద్...'' ''సూరీడూ జిందాబాద్..'' అంటూ పెద్దగా నినాదాలు చేశారు ప్రజలు.

గొల్లపల్లిలో ఆ విధంగా సమస్య సామరస్యపూర్వకంగా ముగించుకునే అక్కడి నుండీ కదిలాం.

దారిలో గంగాధర్ని ప్రత్యేకంగా అభినందించాను. అతడు చిరునవ్వుతో నా అభినందనల్ని స్వీకరించాడు.

''ఆ.. మురళీగారూ.. ఆ దారిలోనే మా ఊరు. ఓసారి మా ఇంటికి వెళ్దామేంటీ...? అన్నాడు గంగాధర్.

గంగాధర్ మాటలకి నాకాశ్చర్యమేసింది. ఎందుకంటే ఈ గ్రామానికి అటు యిటుగానో మా గ్రామం కూడా ఉంది.

ఈ విషయం చెబితే గంగాధర్ మా ఇంటికి కూడా వెళ్దామనే అవకాశం ఉంది.

అప్పుడు అమ్మతో చిక్కొచ్చే ప్రమాదముంది. అందుకే ఆ విషయాన్ని చెప్పదలుచుకోలేదు.

''ఓ.. తప్పకుండా వెళ్దాం సార్..!'' అన్నాను.

వెంటనే కార్లు కలెక్టరుగారి ఊరికేసి సాగాయి. అరగంటలో ఓ ఇంటి ముందు కారాగింది.

ఆ ఇల్లు చాలా ఆధునికంగా కట్టబడింది. పల్లెటూరనంగానే ఏ పాతబడిన ఇల్లో అని ఊహించిన నాకు ఆశ్చర్యం మిగిలింది.

ఫోన్లో అంతకుముందే చెప్పినందున కలెక్టరుగారి బంధువులు మా రాక కోసం ఎదురుచూస్తున్నారు. మేం కారు దిగగానే మమ్మల్ని సాదరంగా ఆహ్వానించారు.

''మిస్టర్ మురళీ.. మీట్ మై ఫాదర్ మిస్టర్ కృష్ణారావు'' అంటూ నాకు పరిచయం చేశాడు గంగాధర్. మరు వెంటనే, ''హి ఈజ్ మిస్టర్ మురళీ.. ఐ.ఎ.ఎస్., సబ్‌కలెక్టర్'' అంటూ నన్నూ పరిచయం చేశాడు.

''నైస్ టు మీట్ యూ'' అన్నారతను. ఆ తరువాత వాళ్ల అమ్మని కూడా పరిచయం చేశాడు. ఆవిడ్ని నమస్కారంతో పలకరించా.. ఆవిడ ప్రతి నమస్కారం చేశారు.

''మిస్టర్ మురళీ.. మై ఫాదర్ ఈజ్ రిటైర్డ్ ఐ.పి.ఎస్. అండ్ మై మదర్ ఈజ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఇన్ మేథ్స్'' అంటూ చెప్పాడు గంగాధర్.

''ఆహా..!'' అనుకున్నాను. నిజంగా గంగాధర్ అదృష్టవంతుడు. అత్యున్నత చదువులు చదివిన తల్లిదండ్రులూ.. మోడ్రన్ కల్చర్ తెలిసిన వారూనూ. ముఖ్యంగా అతడి తల్లి కూడా ఓ ప్రొఫెసర్... అలాంటి వారికి ఎక్కడికి వెళ్లినా మర్యాదా, గౌరవం...! మదిలో నా తల్లీ మెదిలింది. ఈమె నా తల్లీ అని పరిచయం చేసుకొన్న కొద్ది సందర్భాల్లో నేనెంత చిన్నతనానికి లోనైనానో అనుకోకుండా గుర్తుకొచ్చింది.

పల్లెటూరి మాటతీరు కారణంగానే ఆమెతో ఎక్కడికీ వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నాను.

ఏమైనా గంగాధర్ తల్లిదండ్రుల మర్యాదపూర్వక ప్రవర్తనా, మాటతీరూ నాకెంతో నచ్చాయి. ఓ గంట అక్కడ గడిపి ఇద్దరం తిరుగు ప్రయాణమయ్యాం.

* * *

గణతంత్ర దినోత్సవానికి ఇంకా ఒక్కరోజే ఉంది.

ఆ రోజు గంగాధర్ నుండి రమ్మని కబురందితే, వెళ్లాను.

"రండి మురళీగారూ.. ఆ.. గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయి? వాటి ఏర్పాట్లు అని మీరు దగ్గరుండి చూసుకుంటున్నారని అనుకుంటాను" అన్నాడు గంగాధర్.

"యస్.. సార్.! అన్ని ఏర్పాట్లూ సరిగ్గానే జరుగుతున్నాయి. దేరీజ్ నో లెస్సు ఆఫ్ అవర్ పార్ట్"

"ఓకే. ఆ.. యిహాలా మనం గణతంత్ర దినోత్సవానికి స్పెషల్ గెస్టుని ఆహ్వానించడానికి వెళ్లాలి. మీరూ నాతో వస్తున్నారు."

"ఓకే.సార్..!" అంటూ మిగతా ఆఫీసు విషయాలు మాట్లాడి అక్కడ నుండి కదిలాను.

సరిగ్గా సాయంత్రం నాల్గింటికి కలెక్టర్‌గారూ, నేనూ బయల్దేరాం. కారు మా గెస్ట్‌హౌస్ వైపు వెళ్లడం నన్ను కాస్త ఆశ్చర్యపరిచింది.

బహుశా అక్కడ వేరే ఎవర్నైనా కలవాలి కాబోలనుకున్నాను. గెస్ట్‌హౌస్ వద్ద కారు దిగి లోపలికి వెళ్లాం.

వి.ఐ.పి. రూమ్ వద్దకి వచ్చి తలుపు తట్టాడు గంగాధర్. కాసేపటికి తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా...

'అమ్మ!'

నా ఆశ్చర్యానికి అంతులేదు. ఒక విధంగా చెప్పాలంటే షాక్ తిన్నాను.

"వచ్చావట్రా...? చాలాసేపటి నుండీ నీకోసమే ఎదురుచూస్తున్నా. ఎంతైనా నా కోరికని మన్నించావు. బాగుందిరా... ఏకంగా నీ నుండీ మార్పులాన్నీ పంపి మరి నన్ను ఇక్కడికి రప్పించాలట్రా...? అదేరా... కారు పంపి మరీ నన్ను రాచమర్యాదలతో ఇక్కడికి తేవాలా...? నాకో ఉత్తరం ముక్క రాస్తే నేనే ఏ బస్సులోనో వచ్చేసేదాన్నిగా.." అంటూ అమ్మ చెబుతున్న మాటలేం నాకు అర్థం కాలేదు.

అయోమయంగా గంగాధర్ వైపు చూశాను.

అతడు చిరునవ్వు నవ్వాడు.

వెంటనే నన్ను పక్కకి తీసుకెళ్లి..

"మిస్టర్ మురళీ... మీ అమ్మగారైన సుశీలమ్మని నేనే మనవాళ్ల ద్వారా ఇక్కడికి రప్పించాను. మీకు ముందుగా చెప్పి ఈ పని చేయనందుకు నన్ను మన్నించండి. ఇక విషయానికొస్తే, మీరు ఆ మధ్య నాకు పంపిన ఫైల్స్‌తో పాటూ మీ అమ్మగారు రాసిన ఉత్తరం కూడా వచ్చింది. బహుశా పొరపాటున పెట్టి మరిచిపోయినట్టున్నారు. అనుకోకుండా దాన్ని నేను చదవడం... అందులో మీ అమ్మగారి అభిలాష తెలిశాయి. నాకు అర్థం కానిదల్లా ఆమె ఆ చిన్న కోరికని మీరు ఎందుకు నిర్లక్ష్యం చేశారోననే..! మీ అమ్మగారు సామాన్యుల్లా ఏ గుళ్లకో గోపురాలకో విమ్మల్ని తీసుకువెళ్లమని కోరలేదే. అలాగే విహారానికి ఏ కాశ్మీరుకో కన్యాకుమారికో తిప్పమనీ కోరలేదు. దేశభక్తి కొద్దీ గణతంత్రదినోత్సవ ఉత్సవాలని చూడాలన్నారు. ఎంతమంది ఈ రోజుల్లో ఈ కోరికని కోరతారు?

అగస్టు పదిహేనూ. జనవరి ఇరవై ఆరూ ఓ సెలవు దినంగా మాత్రమే గుర్తుంచుకునే వారే చాలామంది. గణతంత్రదినోత్సవాన్ని మనస్ఫూర్తిగా తిలకించాలని ఎంతమందికుంది? అలాంటి అపురూపమైన కోరికని కోరిన మీ అమ్మగారిని ఎందుకు హర్షించలేదో నాకర్థంకావడం లేదు. అందుకే ఆమెకా అవకాశం ఇవ్వడం మాత్రమే కాదు. ఓ స్వాతంత్ర్యయోధుని భార్యగా, ఓ దేశభక్తురాలిగా ఆమెని గణతంత్రదినోత్సవ వేడుకల్లో ఉచితంగా సన్మానించదలిచాం కూడా.

ఆమె గురించి ఆరా తీయగా వెలువడిన అనేక ఇంట్రెస్టింగ్ విషయాల్లో నాకు తెలిసిన ఓ గొప్ప విషయాన్ని మీకు రేపు సభాముఖంగా తెలుపుతాను. మీకు మరో విషయం చెప్పాలి.. ఆమెని మీరే ఇక్కడికి తీసుకొచ్చారని చెప్పాను. అది నిజం కాదని తెలిస్తే ఆమె బాధపడతారు. అందుకే మీరే ఆమెని ఇక్కడికి రప్పించారని దయచేసి చెప్పండి."

గంగాధర్ చెప్పింది విన్న నాకు నోటమాటలేదు. అమ్మనో చదువులేని పల్లెటూరి మనిషిగా తాను జమకడితే, అతడు ఆమెని ఓ స్వాతంత్ర్యయోధుని ధర్మపత్నిగా ఓ దేశభక్తురాలిగా చూశాడు. ఇద్దరి ఆలోచనా దృక్పథంలో ఎంత తేడా?

తానెందుకు ఇప్పటివరకూ తన తల్లి విషయంలో ఆ కోణంలో ఆలోచించలేదూ..? సిగ్గుతో తల కిందకి వాలింది.

తప్పుచేసిన వాడిలా చిన్నబోయిన మొహంతో "థాంక్స్.." అని గంగాధర్‌తో చెప్పి నా పాపాన్ని కడుక్కునే ప్రయత్నానికి నాంది పలికాను.

నన్ను అర్థం చేసుకున్నట్టు నా భుజాన్ని తట్టాడు గంగాధర్.

ఇద్దరం అమ్మ దగ్గరకొచ్చాం.

"అమ్మా! నువ్వు కోరినట్టుగా ఈసారి గణతంత్రదినోత్సవాన్ని కనులారా తిలకించడానికి ఇక్కడికి తీసుకొచ్చాను. నీకు అన్ని ఏర్పాట్లూ చేశాం.


## పిల్లవాడు కాదు పిడుగు

రష్యాలోని పెర్మ్ నగరంలో 15 సంవత్సరాల ఉరల్స్ అనే కుర్రాడు ఇంట్లో తగవుపడి ఎయిర్‌పోర్టుకి వెళ్లి ఎవరికీ తెలియకుండా బోయింగ్ విమానం రెక్కపై ఎక్కాడుట. ఆ విమానం 1300 కి.మీ ప్రయాణించి మాస్కో ఎయిర్‌పోర్టు చేరాక ఆ కుర్రాడు కిందపడ్డాడుట. మంచుకి కాళ్లు గడ్డకట్టి అతడి బూట్లు తీయడం కష్టమైందిట. అంత చలిలో రెండుగంటల సేపు ఆ కుర్రాడు ప్రయాణించి బ్రతికి బయటపడడం ఒక మిరకిల్ అంటున్నారు డాక్టర్లు.

## ముసలితనాన్ని తగ్గించే తేనె

రోజుకొక చెంచాడు తేనె తాగితే వృద్ధాప్యం వెనుకపడుతుందిట. ఎలుకలకి తేనె, పంచదార ఇచ్చి, ఆ రెండు ఇవ్వకుండా మూడు తరగతులుగా విభజించి ఒక ఏడాదిపాటు పరీక్షలు జరిపాక న్యూజీలాండ్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు తమ పరిశోధన అనంతరం ఈ నిర్ధారణకి వచ్చారు. తేనె తాగిన ఎలుకలు చురుగ్గా ఉండడం, తమ ఆహారాన్ని ఎక్కడ దాచుకున్నాయో వెంటనే తెల్సుకోవడం జరిగిందిట. తేనెలోని ఏంటాక్సిడెంట్లవల్లనే అది సాధ్యమైందని, తక్కిన ఎలుకలు ఆ ఔషధ లక్షణాలు లేక త్వరగా జబ్బుపడ్డాయని వారు తెలుసుకున్నారు.

-తటవర్తి



ఇప్పుడు నువ్వు మా అతిథివి. నిన్ను మనింటికి తీసుకువెళ్లేవాడినే కానీ ఇలాంటి గౌరవం ఏ కొద్దిమందికో దొరుకుతుంది. అది నీకు మన కలెక్టరుగారి మూలంగా దొరికింది.

గణతంత్ర దినోత్సవం ముగియగానే నిన్ను మనింటికి తీసుకెళ్తా. నీకే లోటూ ఇక్కడుండదూ. రేపు వచ్చి నిన్ను పెరేడ్ గ్రౌండ్స్‌కి ప్రభుత్వ లాంఛనాలతో తోడ్కొనిపోతాం. సరే..నా...''

ఆ మాటలకి అమ్మ ఉప్పొంగిపోయింది. ఆమె మొహంలో కనబడిన ఆనందం చూసి నాకూ సంతోషమేసింది. ఆ తరువాత ఇద్దరం అక్కడి నుండి కదిలాం.

★ ★ ★

మర్నాడు గణతంత్రదినోత్సవ వేడుకలు ఘనంగా మొదలయ్యాయి.

అమ్మ ప్రముఖులతో పాటు స్టేజిపైన ఆసీనురాలు కావడం నాకు కాసింత గర్వకారణమైంది.

త్రివర్ణపతాకం ఎగురవేశాకా అందరూ జనగణమంగళ....అంటూ జాతీయ గీతం ఏక కంఠంతో అందుకోగానే అక్కడ దేశభక్తి వాతావరణం ఒక్కసారిగ పోటెత్తింది.

అందరిలోనూ ఏదో శక్తి...! అమ్మ విషయమైతే మరి చెప్పనే అవసరం లేదు.

పరిసరాల్ని మరచిపోయి జెండా వందనంలో నిమగ్నమైంది. ఆ తరువాత ఒక్కొక్కరే ప్రసంగించారు.

చివరికి గంగాధర్ లేచి ఉపన్యసించాడు.

"అందరికీ గణతంత్రదినోత్సవ శుభాకాంక్షలు..! ఈరోజు మన స్పెషల్ గెస్టుగా వచ్చిన శ్రీమతి సుశీలమ్మగారి గురించి రెండు ముక్కలు మీకు చెప్ప దలచాను. ఆమె ఓ స్వతంత్రపోరాటయోధుని ధర్మపత్ని. ఆరు నెలలు సావాసం చేస్తే వీరు వారవుతారన్నట్టు.. భర్త సావాసంతో ఈమెలో కూడా దే భక్తి భావం మెండుగా నిండుకుంది. ఈమె ప్రత్యక్షంగా స్వతంత్రపోరాటంలో పాల్గొనకపోయినా తన వంతు సహకారాన్ని పూర్తిగా భర్తకందించి తెరవెనుక ఉండిపోయారామె.

అయితే, ఆమెలో ఒక గొప్ప సంఘ సంస్కర్త దాగి ఉన్నారు. దానికి ఉదా హరణే.. ఈమధ్య సుశీలమ్మగారి పొరుగూరైన గొల్లపల్లి అనే గ్రామంలో మద్య పాన నిషేధం! ఆరా తీస్తే ఆ చైతన్యాన్ని అక్కడి ఆడవారిలో కల్పించిన మహ నీయురాలు మరెవరో కాదూ, మన సుశీలమ్మగారే అని తెలిసింది. అటువంటి ఆమెకి నా జోహార్లు..!

అందుకే ఆమెకీ సన్మానం! చివరిగా కొసమెరుపేంటంటే ఈమె మన జాయింట్ కలెక్టర్ మురళిగారి కన్నతల్లి! ఆమెని సత్కరించుకొనే భాగ్యం మనకి కలిగినందుకు చాలా ఆనందిస్తున్నాను. ఆ సత్కారాన్ని బిడ్డ చేతులమీ దుగా ఆమెకి జరగబోవడం మరో విశేషం'' అంటూ తన ప్రసంగాన్ని ముగిం చగానే కరతాళధ్వనులతో ఆ ప్రాంతం మారుమ్రోగిపోయింది.

నాకైతే కంటి వెంట నీళ్లు వర్షించడానికి సిద్ధమైనాయి. అమ్మకి జరుగుతున్న ఈ గౌరవాన్ని చూసి నా గుండెలు ఆనందంతో ఉప్పొంగిపోయాయి. తన తల్లి గూర్చి గంగాధర్ ఎంత లోతుగా తెలుసుకున్నాడు!

మద్యపాన నిషేధం వెనుక తన తల్లి ప్రయత్నం ఉందని ఇప్పటివరకూ తనకి తెలీదు.

ఏదో ఊర్లో ఆడవాళ్లకి చిన్న చిన్న ఉపకారాలూ, ఉపన్యాసాలూ అమ్మ ఇవ్వడం మాత్రమే తెలుసు. కానీ అమ్మ ఈమధ్య ఇంతగా సంఘసేవకంకితం అయ్యిందని నేను తెలుసుకోలేకపోయాను. అయినా తానెప్పుడూ తల్లినర్థం చేసుకున్నాడు కనుకా?

ప్రజల చప్పట్ల మధ్య లేచి అమ్మని దుశ్శాలువతో కప్పి సత్కరించాను. పూలగుచ్ఛాన్ని అమ్మకందించాను.

మరికొన్ని పూలని ఆమె పాదాలపై ఉంచే నెపంతో వంగి నా కన్నీటిధార లతో ఆమె పాదాలని కడిగి నా తప్పుని తుడిచేసుకునే ప్రయత్నం చేశాను. అమ్మ పరిస్థితైతే చెప్పనే అక్కర్లేదు. ఆమె కళ్లు ఆనందభాష్పాలతో జలాశ యాన్ని తలపించాయి.

ఆమె జీవితంలో అనుభవిస్తున్న అతి మధురమైన ఘడియలివేనని వేరే చెప్పక్కర్లేదు.

నా గొంతు ఒకే ఒక్క ముక్క మాట్లాడడానికి సహకరించింది.

"మన కలెక్టరుగారన్నట్లు సుశీలమ్మగారు ఈ జాయింట్ కలెక్టర్ తల్లి కాదు! ఈ జాయింట్ కలెక్టర్ మురళీ సుశీలమ్మగారి కొడుకని సగర్వంగా చెప్పుకుం టున్నాను.''

నా మాటలకి కలెక్టర్‌తో పాటూ అందరూ హర్షధ్వానాలు చేశారు.

★



## పట్టుదల వుండాలి

తను సినిమాల్లోకి వచ్చిన కొత్తల్లో ఎవరూ తనకి స్వాగతం చెప్పలేదని, పైగా తొలిచిత్రం పరాజయం కావటంతో అస్సలు తన వైపు చూసేవాళ్లు కూడా లేరని వాపోతున్న సమయంలో తెలుగులో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను కాబట్టే ఆ తర్వాత వరస విజయాలతో ముందుకెళ్లిపోగలుగుతున్నాను అని గొప్పగా చెబుతుంది అశిన్. ఎవరికైనా పట్టుదలతోపాటు ఆత్మస్థయిర్యం కూడా వుండాలి మరి అనేది అశిన్ ప్రగాఢ నమ్మకంట. ఆశిన్ చెప్పేది కరెక్టే కదా...

